సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



ప్రయాణం.. ఒళ్లు హూనం

కామవరపుకోట మండలంలోని ప్రధాన రహదారులు ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. అడుగడుగునా గుంతలతో కంకర తేలి బురదమయంగా మారాయి. 12లో ▸



ముంపుబారిన చేపల చెరువులు

కొల్లేరులో వందలాది ఎకరాల్లో చేపల చెరువులు ముంపు బారిన పడే ప్రమాదం ఉండటంతో మత్స్యసంపద కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. 12లో ▸



వరద బాధితులకు సాయం

విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, విద్యా సంస్థలు ముందుకొచ్చాయి. 12లో ▸

ఇక రైతుకు లేదు ధీమా

- ఉచిత పంటల బీమాపై నీలినీడలు
- ఇంతవరకూ బీమా విధానం ప్రకటించని కూటమి సర్కారు
- నాట్ల దశలోనే 14 వేల ఎకరాల్లో రూ.9.4 కోట్ల నష్టం
- ప్రస్తుతం భారీ వర్షాలతో నీట మునుగుతున్న పంట పొలాలు
- గతంలో అన్నదాతకు అండగా నిలిచిన జగన్ సర్కారు
- ఐదేళ్లలో 1,14,011 మంది రైతులకు రూ. 217.64 కోట్ల పరిహారం



సాక్షి, భీమవరం: సాగులో రైతుకు ధీమానిచ్చే పంటల బీమా పథకం అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోంది. ఆగస్టు 31తో ప్రీమియం చెల్లింపునకు గడువు ముగియగా పాలసీని ప్రకటించకుండా రైతులతో చెలగాటమాడుతోంది. సాగు ఆరంభంలోనే భారీ వర్షాలకు పంట నష్టం వాటిల్లినా ఇంకా మేల్కొకపోవడం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. సాగుకాలంలో విపత్తులతో పంటకు నష్టం వాటిల్లినప్పుడు పరిహారం రూపంలో రైతులను ఆదుకునేందుకు పంటల బీమా పథకం దోహదపడుతుంది. బీమా కంపెనీ లెక్కించిన పంట విలువలో రైతులు ఐదు శాతం వాటా చెల్లించాలి. 2014 టీడీపీ హయాంలో ఫసల్ బీమా యోజన ద్వారా ప్రీమియంలో 3 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తే మిగిలిన 2 శాతం రైతులు చెల్లించుకునే వారు. రైతులు వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకునే సమయంలో పంటకు బీమా చేయించేవి. మిగిలిన రైతులకు ప్రీమియం గడువుపై సరైన సమచారం లేకపోవడం, పంట రుణాల విడుదలలో జాప్యం తదితర కారణాలతో చాలా మంది ప్రీమియం చెల్లించకపోవడం వల్ల విపత్తులు ఏర్పడినప్పుడు పరిహారం అందక నష్టపోవాల్సి వచ్చేది. దీనికి తోడు ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) కూడా ఆరు నెలలకో, ఏడాదికో ఇవ్వడం వలన పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందిపడాల్సి వచ్చేది.

మార్గదర్శకాలు రాలేదు: అధికారులు

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో పల్లపుప్రాంతాల్లోని పంటపొలాలు నీట మునుగుతున్నాయి. సాగులో బీమా భరోసా లేకపోవడం ఆందోళనకు గురిచేస్తోందని రైతులు అంటున్నారు. పంటల బీమా పథకం విధివిధానాలకు సంబంధించి తమకు ఏ విధమైన మార్గదర్శకాలు రాలేదని వ్యవసాయశాఖ అధికారులు అంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో స్పష్టత కరువు

పంటల బీమా పథకం అమలుపై కూటమి ప్రభుత్వం ఎటూ తేల్చకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తోంది. రైతుల భాగస్వామ్యం లేకుండా పంటల బీమా ఏంటని ఇటీవల సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు గత ప్రభుత్వం అమలుచేసిన ఉచిత పంటల బీమా పథకం అమలును ప్రశ్నార్థకం చేస్తోంది. జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు మొదలై రెండు నెలలు కావస్తోంది. సాగు ప్రారంభంలో వచ్చిన భారీ వర్షాలతో సుమారు 14 వేల ఎకరాల్లోని పంటకు రూ.9.4 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు ఎప్పుడు అందుతుందో తెలీని పరిస్థితి. మరోపక్క అన్నదాత సుఖీభవ పేరిట రైతులకు ఏటా ఇస్తామన్న రూ. 20 వేలకు అతీగతి లేదు. క్రాప్ బీమా ప్రీమియం చెల్లింపునకు ఆగస్టు 31తో గడువు ముగిసింది. గడువు పెంచుతారని రైతులు, వ్యవసాయాధికారులు భావించినప్పటికి ప్రభుత్వం నుంచి సమాధానం లేదు. రైతులు ప్రీమియం చెల్లించాలని కానీ, గత ప్రభుత్వం మాదిరి ఉచిత పంటల బీమా పథకం అమలుచేస్తామని కానీ, గడువు పెంచుతామని కానీ కూటమి ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడం రైతులను కలవరపరుస్తోంది. తొలకరి పంట చిరుపొట్ట దశకు చేరుకోగా ముమ్ముందు విపత్తులు ఏర్పడితే నష్టం తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.217.64 కోట్ల పరిహారం

రైతుపై భారం పడకుండా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేశారు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎకరానికి రూ.29,000 బీమా కాగా రైతు వాటా రెండు శాతం రూ.580 చొప్పున ఎన్ని ఎకరాలు సాగవుతుంటే అన్నింటికి ప్రభుత్వమే చెల్లించేది. దీనివలన సాగు భూమికి బీమా పథకం వర్తించడం వల్ల పంట నష్టం వాటిల్లినప్పుడు రైతులతో పాటు గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం అందేది. గత ఐదేళ్లలో వివిధ సీజన్లలో పంట నష్టపోయిన మొత్తం 1,14,011 మంది రైతులకు రూ. 217.64 కోట్ల బీమా పరిహారం ఇచ్చారు.

న్యూస్‌రీల్

డ్రోన్ల సాయంతో వరద ఉధృతి పరిశీలన



భీమవరంలో కాలువ పరిస్థితిని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

భీమవరం: అధిక వర్షాల కారణంగా జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు, డ్రెయిన్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు డ్రోన్ల వినియోగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవడంతో డ్రెయిన్లు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయన్నారు. దీని కారణంగా ఎక్కడైనా డ్రెయిన్లు, కాలువలకు గండి పడే ప్రమాదం ఉంటే తెలుసుకునేందుకు డ్రోన్ల సాయంతో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గండిపడే ప్రమాదమున్న ప్రాంతాలు గుర్తించి రెవెన్యూ అధికారుల సహకారంతో పోలీస్ శాఖ తక్షణ చర్యలు చేపడుతుందని చెప్పారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



భీమవరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

భీమవరం: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో భీమవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజానీకం దుర్భర పరిస్థితుల్ని ఎదుర్కొంటోందని తక్షణమే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, అర్హులందరికీ రేషన్ కార్డులిచ్చి 14 రకాల నిత్యావసరాలను అందించాలని డిమాండ్ చేశారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను నియంత్రించాలన్నారు. పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ఎస్ఎస్ఎస్‌వీ ప్రసాద్‌కు అందచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లుల శ్రీనివాసరావు, వైవీ ఆనంద్, కిలారి మల్లేశ్వరావు, వీరవల్లి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరో జీవితంలో వెలుగు



విష్ణు కళాశాలలో నేత్రదాన పక్షోత్సవాల్లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: నేత్రదానంతో మరో జీవితంలో వెలుగులు నింపేలా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం విష్ణు కళాశాలలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చూపు లేకపోవడం ఎంతో ఇబ్బందికరమైన పరిస్థితి అని.. నేత్రదానంతో సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. చనిపోయిన వారి కంటి రెటీనా దానం చేయడం ద్వారా ఇద్దరికి చూపు అందించవచ్చనని దీనిలో భాగంగానే తాను ఐ డొనేషన్ ప్లెడ్జి ఫాం నింపుతున్నానని నాగరాణి ప్రకటించారు. ప్రజలు కూడా నేత్రదానం దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భీమవరం ఇన్‌చార్జ్ ఆర్డీవో ఎం.అచ్యుత్ అంబరీష్, గ్లోబల్ సర్వీసెస్ కోఆర్డినేటర్ లయన్స్ ఇంటర్నేషనల్ సీహెచ్ కృష్ణంరాజు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కొమ్ముల మురళీకృష్ణ, భీమవరం క్లబ్ ప్రెసిడెంట్ పిజె మూర్తిరాజు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ డి మహేశ్వరరావు, విష్ణు కళాశాల డైరెక్టర్ పి.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

44 మంది టీచర్ల సర్దుబాటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు డివిజన్ పరిధిలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. ఈ పని సర్దుబాటులో మొత్తం 44 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేసినట్లు తెలిపారు. వారిలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) 11 మంది, ఎస్ఏ హిందీ నలుగురు, ఎస్ఏ ఇంగ్లీష్ 12మంది, ఎస్ఏ గణితం ముగ్గురు, ఎస్ఏ పీఎస్ ఇద్దరు, ఎస్ఏ బీఎస్ ఆరుగురు, ఎస్ఏ సోషల్ ఆరుగురు ఉన్నట్లు తెలిపారు.

బుడమేరు ముంపు లేకుండా చర్యలు



దుంపగడపలో ఉప్పుటేరు ప్రవాహాన్ని మ్యాప్ ద్వారా తెలుసుకుంటున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

ఆకివీడు: బుడమేరు ముంపు నీరు కొల్లేరు నుంచి ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి పోయేందుకు ఉప్పుటేరులో ఉన్న మేటల్ని తొలగించే చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి చెప్పారు. మండలంలోని దుంపగడపలోని రైల్వే వంతెన వద్ద ఉప్పుటేరులో మేటల్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైల్వే వంతెన నిర్మాణ సమయంలో ఏర్పడిన మట్టి, గుర్రపుడెక్క మేటల వల్ల నీటి ప్రవాహం మందగించిందన్నారు. రైల్వే ఖానాల్లో పేరుకుపోయిన మేటల్ని రైల్వే అధికారులు తొలగించేందుకు చర్యలు తీసుకునేలా వారితో మాట్లాడనున్నట్లు జేసీ చెప్పారు. ఉప్పుటేరు నీరు గ్రామాల్లోకి చొచ్చుకువెళ్లకుండా ఇసుక మూటలతో గట్లను బలపరచాలన్నారు. కార్యక్రమంలో డ్రైనేజ్ జేఈ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంపులో కొల్లేరు

కైకలూరు: కొల్లేరులో పెదఎడ్లగాడి నుంచి పెనుమాకలంకకు చేరే రహదారి పూర్తిగా నీట మునిగింది. దీంతో పెనుమాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్ వంటి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏలూరు – కైకలూరు రోడ్డు మార్గంలో పలు ప్రాంతాల్లో రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. తమ్మిలేరు నుంచి భారీగా నీటిని విడుదలతో నీరు కొల్లేరుకు చేరుతోంది. పలు డ్రెయిన్ల నీరు కొల్లేరుకు రావడంతో మరో రెండు రోజుల్లో భారీగా నీరు కొల్లేరు గ్రామాలకు ముంచెత్తుతోందని భావిస్తున్నారు. పక్షి ప్రేమికులకు స్వర్గధామంగా పేరుగాంచిన ఆటపాక కేంద్రానికి వరద పోటు తగిలింది. ఇక్కడ 283 ఎకరాల్లో పక్షుల విహార చెరువును అటవీశాఖ ఏర్పాటు చేసింది. సమీపంలో పోల్‌రాజ్ డ్రెయిన్ పారుతోంది. మధ్యలో గట్టు మాత్రమే అడ్డు ఉంది. ప్రస్తుత వరదలకు గట్టు అంచుల వరకు నీరు చేరంది. ఏ క్షణమైన గట్టు తెగే అవకాశం ఉంది. ఆటపాక నుంచి ఏలూరు మండలం కోమటిలంక వెళ్ళే రహదారి కొట్టుకుపోయింది. దీంతో ప్రజలు పడవలు, థర్మాకోల్ షీట్లతో తయారు చేసిన డోంగ్రిలతో ఏరు దాటి ఆటపాక చేరుతున్నారు.



ఆటపాక పక్షుల కేంద్రం గట్టు వరకు చేరిన పోల్‌రాజ్ కాల్వ వరద నీరు



ప్రమాదకర పరిస్థితుల్లో ఏరు దాటుతున్న కోమటిలంక ప్రజలు



కోమటిలంక వద్ద ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

భీమవరం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని భీమవరంలో మంగళవారం శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వర్ధనపు దివాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు స్వస్తి చెప్పి పాత పద్ధతిలో టెండర్ల ద్వారా నూతన మద్యం విధానాన్ని అమలులోనికి తెస్తామని చెప్పడంతో మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఉద్యోగ భద్రతపై ఆందోళన చెందుతున్నారన్నారు. గత ఐదేళ్లుగా మద్యంషాపుల్లో పనిచేస్తున్న తమ పరిస్థితి ఏంటనే ఆందోళన వ్యక్తమవుతుందన్నారు. నూతన మద్యం విధానం వల్ల తమ కుటుంబాలు రోడ్డుపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం పాలసీ మారిస్తే ఇంతవరకు పనిచేస్తున్న వారికి కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ నియామకాలు చేసి న్యాయం చేయాలని కోరారు. ఉద్యోగులకు అనుకూల నిర్ణయం తీసుకోకుంటే ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఆందోళనలో యూనియన్ నాయకులు తాడి శివకుమార్, పీఎల్‌డీ ప్రసాద్, సీహెచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న మద్యం షాపు ఉద్యోగులు

డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపు

సాక్షి స్పందన

ఏలూరు రూరల్: ఎట్టకేలకు అధికారులు మురుగు డ్రెయిన్ల ఆక్రమణలు తొలగించారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'ముంపు బారిన పంట చేలు' కథనంపై స్పందించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నాగమణితో పాటు వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది కోటేశ్వరదుర్గాపురం శివారు చేపల చెరువుల వద్ద మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించే చర్యలు చేపట్టారు. రాజుగారి చెరువు వద్ద తూరలు తొలగించారు. దీంతో మురుగునీరు కిందకు పారుతోంది. మాదేపల్లి, లింగారావుగూడెంలో సైతం చేపల చెరువుల పరిసరాల్లో మురుగుబోదెల్లో చెత్తచెదారం పొక్లెయిన్‌తో తొలగించారు. మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య మల్కాపురంలో పంటచేల పరిసరాల్లో ప్రవహిస్తున్న తాసుపాము శిల డ్రెయిన్ పరిశీలించారు. రైతులను అప్రమత్తం చేశారు. వర్షాలు, వరద కారణంగా 625 ఎకరాల్లో పంటచేలు నీట మునిగాయన్నారు. వరద ఉధృతి తగ్గడంతో మంగళవారం నాటికి 300 ఎకరాల్లో మాత్రమే నీరు నిలిచి ఉందన్నారు. రెండురోజుల్లో చేలు తేరుకుంటాయన్నారు. చేలు దబ్బు దశలో ఉన్నందున రైతులకు పెద్దగా నష్టం ఉండదన్నారు.



కోటేశ్వరదుర్గాపురం వద్ద మురుగు డ్రెయిన్ తూర తొలగించిన దృశ్యం

ఆక్వా తరగతులు త్వరలో ప్రారంభం

నరసాపురం రూరల్: నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలోని ఆక్వా యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న ఆక్వా కళాశాలలో తరగతులు అక్టోబర్ నుంచి ప్రారంభమవుతాయని అసోసియేట్ డీన్ టి.నీరజ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. గత విద్యాసంవత్సరంలో ఈ ఆక్వా కళాశాలను ప్రారంభించామని, ఇబ్బందులను అధిగమించి కళాశాలను ప్రగతి పథంలో నడిపిస్తున్నామన్నారు. రెండో బ్యాచ్‌కు సంబంధించి మొదటి విడత కౌన్సిలింగ్ పూర్తయిందని, సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. కళాశాలలో 66 సీట్లు ఉన్నాయని, అన్నీ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ అవుతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం లక్ష్మణేశ్వరం తుఫాను షెల్టర్ భవనంలో కళాశాల కొనసాగుతోందని పూర్తి స్థాయిలో వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. విషయాన్ని ఆక్వా యూనివర్సిటీ అధికారుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. వసతులు, ల్యాబ్‌ల కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

ద్వారకాతిరుమల పంచాయతీ కార్యదర్శిపై వేటు

ద్వారకాతిరుమల: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ద్వారకాతిరుమల పంచాయతీ కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక కార్యాలయంలో నిధులు దుర్వినియోగం జరిగినట్లు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ అముక్త ఈ ఏడాది జనవరి 29న స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి జిల్లా కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారిని విచారణకు ఆదేశించారు. అధికారులు ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు రూ.1,43,44,700 అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించారు.

● ఆత్మీయ కలయిక



వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన పాలకొల్లు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల గోపీ
- అమరావతి

థియేటర్‌లో పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ వీరంగం

- సోఫాలు, కుర్చీల ధ్వంసం
- పోలీసులను ఆశ్రయించిన యాజమాన్యం

సాక్షి, భీమవరం : పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఓ థియేటర్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిమానులు, జనసైనికులు సోమవారం రాత్రి వీరంగం సృష్టించారు. తాము కోరినట్టుగా సినిమాలోని పాటలు రిపీట్ వేయలేదని థియేటర్‌లోని ఫర్నీచర్ ధ్వంసం చేశారు. థియేటర్ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించడంతో వారు థియేటర్ వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. వివరాల్లోకి వెళితే... డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం ఆయన నటించిన గబ్బర్ సింగ్ సినిమాను తాడేపల్లిగూడెంలోని ఓ థియేటర్‌లో స్క్రీన్-1లో ప్రదర్శించారు. రాత్రి ఫస్ట్ షోకు వచ్చిన ఆయన అభిమానులు పాట పూర్తయిన సందర్భంలో తిరిగి ఆ పాటను రిపీట్ చేయాలని పట్టుబట్టారు. షో ఆలస్యమవుతుందని, ప్రతి పాటనూ రిపీట్ చేయడం వీలుకాదని యాజమాన్యం వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినిపించుకోలేదు. పాటలను రిపీట్ చేయడం లేదని థియేటర్‌లోని సోఫాలు, కుర్చీలు ధ్వంసం చేశారు. దీంతో థియేటర్ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. పోలీస్ అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ ఘటనపై థియేటర్ యాజమాన్యం నోరువిప్పడం లేదు. అభిమానుల వీరంగానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.



ధ్వంసమైన సోఫాలు, కుర్చీలు



వీరంగం సృష్టిస్తున్న అభిమానులు

క్లుప్తంగా

ఆక్వా కార్మికులకు తప్పిన ముప్పు



పొలంలోకి వెళ్లిన బస్సు కిటికీల నుంచి బయటకు వస్తున్న ఆక్వా కార్మికులు

భీమవరం: స్టీరింగ్ వదిలేయడంతో బస్సు అదుపుతప్పి చేలోకి దూసుకెళ్లిన ఘటనలో ఆక్వా కార్మికులకు త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. భీమవరం వన్‌టౌన్ పరిధిలోని రొయ్యల పరిశ్రమకు చెందిన బస్సులో మంగళవారం కార్మికులను తీసుకు వెళుతోంది. అయితే యనమదుర్రు రోడ్డులోకి వచ్చేసరికి బస్సు అకస్మాత్తుగా స్టీరింగ్ వదిలేయడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న చేలోకి దూసుకెళ్లి ఒరిగిపోయింది. దీంతో బస్సులో ఉన్న ఆక్వా కార్మికులు వెంటనే కిటికీల ద్వారా బయటకు దూకేశారు. అదే సమయంలో రహదారిపై వెళుతున్న ప్రయాణికులు గమనించి వారికి సాయం చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని సీఐ నాగరాజు చెప్పారు. ప్రమాదానికి గల కారణాలను సేకరిస్తున్నట్లు సీఐ తెలిపారు.

స్కానింగ్ సెంటర్లో అగ్నిప్రమాదం



స్కానింగ్ సెంటర్ లోపలి భాగం దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లో అగ్నిప్రమాదం జరిగి సుమారు రూ.9 లక్షలు నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక రంగమన్నారు పేట పెట్రోల్‌బంక్ పక్కనే ఉన్న రవి స్కానింగ్ సెంటర్లో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. స్కానింగ్ సెంటర్లో వెనుక ఉన్న ఎక్స్‌రే రూమ్‌కి అనుసంధానంగా ఉన్న మెయింటెనెన్స్ రూమ్‌లో విద్యుత్ బోర్డు షార్ట్ సర్క్యూట్ అయ్యి ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఈ స్కానింగ్ సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో రోగులు లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

వీరవాసరం: ఇటీవల ఇంటి నుంచి అదృశ్యమైన ఓ వ్యక్తి మంగళవారం గొంతేరు డ్రెయిన్‌లో శవమై కనిపించాడు. వివరాల్లోకి వెళితే.. వీరవాసరం గ్రామానికి గంటా వెంకట సత్యనారాయణ (54) ఆగస్టు 27వ తేదీ నుంచి కనిపించడం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మంగళవారం గొంతేరు డ్రెయిన్ ముత్యాలపల్లి, వెంప గ్రామాల మధ్య సత్యనారాయణ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రయాణమా.. ఒళ్లు హూనమే

- కామవరపుకోట మండలంలో అధ్వానంగా రోడ్లు
- ఇటీవల భారీ వర్షాలకు రహదారులు ఛిద్రం
- రోడ్లకు తూట్లతో ప్రయాణికులకు తప్పని పాట్లు
- అడుగడుగునా గోతులతో నరకం చూపిస్తున్న వైనం



కామవరపుకోట శివారు రోడ్డులో ఏర్పడిన గోతులు



జంగారెడ్డిగూడెం - ఏలూరు రహదారిలో గొల్లగూడెం వద్ద గోతులమయంగా ఉన్న రోడ్డు



చింతలపూడి - కామవరపుకోట రహదారిలో జీలకర్రగూడెం వద్ద భారీ గోతులతో ఉన్న రోడ్డు



నారాయణపురం వద్ద భారీ గుంతను తప్పించి వెళుతున్న ఆటో



అడమల్లి శివారులో రోడ్డు దుస్థితి

కామవరపుకోట: మండలంలోని ప్రధాన రహదారులు భారీ గోతులతో నిండి ప్రయాణికులకు నరకాన్ని చూపుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారులు ఛిద్రంగా మారి అడుగడుగునా గుంతల్లో నిండి ఎక్కడ చూసినా కంకర తేలి బురదమయంగా మారాయి. రోడ్లపై వర్షం నీటితో నిండిన గుంతలతో ప్రయాణం చేయాలంటేనే వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. చింతలపూడి నుంచి జీలకర్రగూడెం, కామవరపుకోట వరకు రోడ్డులో బస్సు సర్వీసులు తక్కువగా ఉండటంతో నిత్యం ఆటోలు, పామాయిల్ గెలల లోడు లారీలు ఎక్కువగా తిరుగుతుంటాయి. భారీ గుంతలలో ఈ వాహనాలు తప్పనిసరి పరిస్థితుల్లో తిరగడం వల్ల పూర్తిగా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. అలాగే జంగారెడ్డిగూడెం, ఏలూరు వయా దేవులపల్లి నుంచి రావికంపాడు, గొల్లగూడెం, నారాయణపురం, ఆడమిల్లి, తడికలపూడి వరకు అడుగడుగున ఏర్పడిన గుంతలు కుంటలను తలపిస్తున్నాయి. ఈ గుంతల వల్ల జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వరకు బస్సులో, ఇతర వాహనాల్లో ప్రయాణంలో కుదుపులకు శరీరం హూనమై ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. ఈ రోడ్ల మరమ్మతుల నిమిత్తం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చింతలపూడి నుంచి కామవరపుకోట వరకు రూ.30 లక్షలు, ఏలూరు - జంగారెడ్డిగూడెం వయా తడికలపూడి, దేవులపల్లి వరకు రోడ్డుకు రూ.24 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయినా అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని వాహనచోదకులు, ప్రయాణికులు వేడుకుంటున్నారు.

త్వరలో రోడ్లకు మరమ్మతులు చేపడతాం



రహదారుల భవనాల శాఖ ఆధ్వర్యంలో చింతలపూడి నుంచి కామవరపుకోట వరకు, ఏలూరు - జంగారెడ్డిగూడెం వయా దేవులపల్లి నుంచి తడికలపూడి వరకు రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తి అవగానే రహదారుల మరమ్మతుల పనులను ప్రారంభిస్తాం.

– సొంగ సుందర్‌రావు, ఆర్‌అండ్‌బీ ఏఈ, కామవరపుకోట మండలం

ఆటో మరమ్మతులకే ఎక్కువ ఖర్చవుతోంది



రహదారులలో అడుగడుగునా ఏర్పడిన గుంతలలో ఆటోలు నడపాలంటేనే నరకం చూస్తున్నాం. ఆటో ప్రతిసారి మరమ్మతులకు గురవుతోంది. సంపాదించిన దానిలో ఎక్కువ శాతం మరమ్మతులకే ఖర్చవుతోంది. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలి.

– ప్రొద్దుటూరు సుందర్రావు, ఆటో డ్రైవర్, కామవరపుకోట

ముంపుబారిన చేపల చెరువులు

- ఏలూరు మండలంలో 10 వేల ఎకరాల్లో చేపల సాగు
- చేపలు కొట్టుకుపోకుండా గట్లపై వలలతో అడ్డుకట్ట



పెదయాగనమిల్లి వద్ద చెరువు గట్ల అంచుకు చేరిన వరద నీరు, చుట్టూ వలలు కట్టిన దృశ్యం

ఏలూరు రూరల్: కొల్లేరులో వందలాది ఎకరాల్లో చేపల చెరువులు ముంపుబారిన పడేందుకు సిద్ధంగా ఉండటంతో చెరువుల యజమానులకు కంటి మీద కునుకు కరువైంది. చెరువుల్లో మత్స్యసంపద కాపాడుకునేందుకు నానా అగచాట్లు పడుతున్నారు. మట్టి మూటలను సిద్ధం చేసుకుని బలహీనంగా ఉన్న చెరువు గట్లను పటిష్టపరుస్తున్నారు. మరికొందరు చెరువులో చేపలు కొల్లేరులోకి కొట్టుకుపోకుండా గట్ల చుట్టూ వలలు కట్టుకుంటున్నారు. ప్రధానంగా కోమటిలంక, పెదయాగనమిల్లి, కలకుర్రు, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, మొండికోడులో చెరువులు వద్ద ప్రమాదస్థాయిలో వరదనీరు ప్రవహిస్తోంది. మరో 24 గంటలు వరద ఉధృతి ఇలాగే కొనసాగితే వందలాది ఎకరాల చెరువు గట్లకు గండ్లు పడే ప్రమాదం ఉందని యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు రూరల్ మండలంలోని గ్రామాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. ఎకరానికి సుమారు 1.50 లక్షలు చొప్పున పెట్టుబడి పెట్టారు. కొన్ని చెరువులు చేపల పట్టుబడికి సిద్ధంగా ఉన్నాయి. వీటి విలువ కోట్ల రూపాయల్లో ఉంటుందని తెలుస్తోంది. నాలుగు రోజులుగా తమ్మిలేరు, బుడమేరు నుంచి కొల్లేరులోనికి వేలాది క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండడంతో చెరువులు యజమానులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

9న టెన్నికాయిట్ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: టెన్నికాయిట్ జూనియర్, సబ్‌జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 9వ తేదీన చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు యు.రాంప్రసాద్, కార్యదర్శి తిరుమలరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఏలూరు కేపీడీటీ స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ పోటీలు జరుగుతాయన్నారు. 2010 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత పుట్టినవారు సబ్‌జూనియర్ జట్టుకు, 2006 ఏప్రిల్ ఒకటో తేదీ తరువాత పుట్టిన వారు జూనియర్ జట్లకు అర్హులన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ ఆధార్, పుట్టినతేదీ ధ్రువపత్రాలతో హాజరై అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి కట్టా నాగేశ్వరరావును సంప్రదించాలని సూచించారు.

30 లీటర్ల సారా స్వాధీనం



సారాను స్వాధీనం చేసుకున్న అధికారులు

భీమడోలు: భీమడోలు ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలోని ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రామానుజపురంలో మంగళవారం ఎస్‌ఈబీ అధికారుల బృందం ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సీఐ గిరిజా కుమారి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేయగా గ్రామంలో సారా కాసి టిన్నుల్లో విక్రయిస్తున్న వీరమళ్ల వెంకటేశ్వరరావు అదుపులోకి తీసుకుని, అతని నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, సిబ్బంది ఫిలిప్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫేక్ కాల్‌తో పోలీసుల ఉరుకులు



సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు అధికారులు

నూజివీడు: ఒక ఫేక్ కాల్‌తో రాత్రంతా ఉరుకులు పెట్టాల్సిన పరిస్థితి పోలీసు అధికారులకు ఎదురైంది. వివరాల్లోకి వెళితే.. నూజివీడు నుంచి విస్సన్నపేట రోడ్డులో ఆటోలో అమ్మాయిని తీసుకెళ్తున్నారంటూ 112కి సోమవారం రాత్రి ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి చెప్పాడు. దీనిపై ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వెంటనే స్పందించి నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణను అప్రమత్తం చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌తో పాటు ఎస్‌బీ సీఐ బోనం ఆదిప్రసాద్, గణపవరం సీఐ సుభాష్, మరో సీఐ అబ్దుల్ నబీ, చాట్రాయి, నూజివీడు రూరల్, ఆగిరిపల్లి, పెదవేగి ఎస్సైలను నూజివీడుకు పంపారు. వీరంతా డీఎస్పీ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో తెల్లవార్లు సెర్చ్ ఆపరేషన్ కొనసాగించారు. అయితే అది ఫేక్‌కాల్ అని తెల్లవారిన తరువాత తేలడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

వరద బాధితులకు 'పశ్చిమ' ఆపన్నహస్తం



భీమవరంలో వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి



భోజన ప్యాకెట్లు తయారు చేస్తున్న కలెక్టరేట్ ఉద్యోగులు

- కలెక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో విజయవాడకు భోజన ప్యాకెట్ల తరలింపు
- భాగస్వాములవుతున్న ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు
- బాధితులకు సహాయ చర్యల్లోనూ పాల్గొంటున్న మున్సిపల్ ఉద్యోగులు

భీమవరం (ప్రకాశంచౌక్): విజయవాడలోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు పశ్చిమ గోదావరి జిల్లాలోని పలువురు దాతలు, సేవా, విద్యాసంస్థలు, పలు అసోసియేషన్లు ముందుకు వచ్చి మానవత్వం చాటుతున్నాయి. వరదల్లో చిక్కుకున్నవారు ఆకలితో అలమటించకూడదని ఆయా సంస్థల నుంచి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో భారీగా భోజన ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, మంచినీటి ప్యాకెట్లు, బిస్కెట్లు, రొట్టెలు తదితర ఆహార పదార్థాలు, పానీయాలను ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలిస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి 80 వేల భోజనం ప్యాకెట్లు, మందులు పంపించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 1.30 లక్షల భోజన ప్యాకెట్లను ఆయా సేవా సంస్థలు విద్యాసంస్థలు దాతల సహకారంతో కలెక్టర్ నాగరాణి పంపించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్వచ్ఛంద సేవా సంస్థలను విద్యాసంస్థలను దాతలను ప్రోత్సహించి వరద బాధితులకు ఆహార అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. భోజనం తయారీ ప్రాంతాలను, ప్యాకింగ్ దగ్గరుండి పర్యవేక్షించడమే కాకుండా వాటిని వాహనాల్లో విజయవాడకు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రం తాజా భోజనం తరలింపు

మంగళవారం మధ్యాహ్నం 80,760, రాత్రి 32,700 ఆహార పొట్లాలను తయారు చేసి పంపించారు. వీటితోపాటు 22వేల రస్కులు, 14 వేల బన్‌లు, 600 బిస్కెట్ ప్యాకెట్‌లు, 25 వేల వాటర్ ప్యాకెట్స్ విజయవాడకు పంపించినట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు. అదేవిధంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నుంచి 9,800, భీమవరం ప్రాన్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్, చైతన్య గోదావరి విద్యా వికాసం 6 వేల చొప్పున, తాడు కొట్టు సుబ్బరాజు, తిరుమల కాలేజీ, సంధ్యా మెరైన్, దేవదాయ శాఖ, ఎఫ్ఎఫ్‌టీ ఫుడ్ ప్యాక్ట్ కంపెనీ, తాడేపల్లిగూడెం శశి కాలేజ్ గ్రూపు 5 వేలు చొప్పున, భీమవరం విష్ణు కాలేజీ, తాడేపల్లిగూడెం ఎన్ కే గ్రూప్ నంద్యాల కృష్ణమూర్తి 4 వేలు, ఆకివీడు చాంబర్ ఆఫ్ కామర్స్ 3,500, కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ 3 వేలు, ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ 2,500, జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం 2 వేల చొప్పున ఆహార పొట్లాలను మంగళవారం మధ్యాహ్నం అందజేశారు. అలాగే మంగళవారం రాత్రి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ 6,700, తాడేపల్లిగూడెం ఎన్‌కే మెరైన్స్ 6 వేలు, తణుకు ఆంధ్ర షుగర్స్, దేవదాయ శాఖ 5 వేలు చొప్పున ఆహార పొట్లాలను అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు.

నేడు లక్ష భోజన ప్యాకెట్ల పంపిణీకి కలెక్టర్ చర్యలు

బుధవారం కూడా జిల్లా నుంచి విజయవాడ వరద బాధితులకు లక్ష భోజనం ప్యాకెట్లను పంపించేందుకు జిల్లా కలెక్టర్ నాగరాణి చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని పలువురు దాతలు సేవా సంస్థలు, ప్రముఖ విద్యాసంస్థల నుంచి భోజనం ప్యాకెట్లు సేకరించి విజయవాడకు పంపించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు



తణుకు ఎల్ఐసీ కార్యాలయంలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తణుకు అర్బన్: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ) వారోత్సవాల్లో భాగంగా మంగళవారం తణుకు బ్రాంచ్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభాపాటవాలను చూపారు. పోటీల అనంతరం ఎల్ఐసీ ఉద్యోగులు వి.పుష్పరాజ్, జి.సుబ్రహ్మణ్యం, ఆర్.జయ్‌కుమార్, సాయికృష్ణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల్లో విజేతలను నిర్ణయించారు.

అఖండ అన్న సమారాధన



అత్తిలిలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: శ్రీకృష్ణాష్టమి వేడుకలు ముగింపు సందర్భంగా అత్తిలి శివారు సీతానగర్‌లో గల శ్రీకృష్ణాలయం వద్ద మంగళవారం అఖండ అన్నసమారాధన జరిపారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

వరి కోతలు ప్రారంభం



పట్టింపాలెం సచివాలయం ఎదురుగా రోడ్డుపై చేర్చిన ధాన్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యాయి. మంగళవారం పట్టింపాలెం ఎర్ర కాలువ బాడవాలో పదెకరాల్లో వరి కోతలు చేపట్టారు. పీఆర్–126 రకానికి చెందిన వరి వంగడాన్ని యంత్రాలతో కోతలు కోశారు. ఒక పక్క వాతావరణ మార్పుల నేపథ్యంలో పచ్చిపై ధాన్యాన్ని కోస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గత సీజన్ కంటే దిగుబడులు తక్కువగా వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఎండాకు తెగులు కారణంగా దిగుబడులు తగ్గుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ నెలాఖరు నాటికి 500 నుంచి 700 ఎకరాల్లో కోతలు కోసే అవకాశం ఉందని వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



తణుకులో విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి మానవత సంస్థ ద్వారా రూ. 12 వేల ఆర్థిక సహాయం అందజేసినట్లు తణుకు మానవత సంస్థ అధ్యక్షురాలు కఠారి శారదాదేవి తెలిపారు. మంగళవారం మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థిని ఎం లక్ష్మి రుచితకు తణుకు మానవత సంస్థ ద్వారా రూ. 10 వేలు, బసవ రామకృష్ణారావు రూ. 2 వేలు ఆర్థిక సహాయం మొత్తం రూ. 12 వేల చెక్కును విద్యార్థినికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, మండల చైర్మన్ వీవీ రామకృష్ణారావు, జిల్లా కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, మండల కన్వీనర్ ఏ బాలాజీ, ఏ సుబ్బారావు, బీ రామకాశీ, వీవీ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరిచేల పరిశీలన



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

పెంటపాడు: అధిక వర్షాల కారణంగా నీట మునిగిన వరిచేలను కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. మండలంలోని చింతపల్లి, రావిపాడు గ్రామాల రైతులతో శాస్త్రవేత్తలు సమావేశమయ్యారు. ఏవో పార్థసారథి ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. ముంపునకు కొద్ది రోజుల ముందు రసాయనిక ఎరువులు వేసిన పొలాలు త్వరగా కుళ్లిపోయి నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులకు వివరించారు. బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందన్నారు. క్రాఫ్ ప్రొడక్షన్ రజిత, వీఏఏలు నాగేంద్ర రైతులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న హైవే నిర్వహణ

- ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో ప్రమాదాలు
- నిత్యం మరమ్మతుల పేరుతో ట్రాఫిక్ మళ్లింపు
- మృత్యువాత పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని వాహనదారుల విజ్ఞప్తి



ఉండ్రాజవరం జంక్షన్ జాతీయ రహదారిపై జరుగుతున్న నిర్మాణ పనులు



ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ట్రాఫిక్ మళ్లించిన అధికారులు

తణుకు: జాతీయ రహదారిపై చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణాలు, మరోవైపు జాతీయ రహదారి నిర్వహణ పనులు వెరసి వాహనదారుల ప్రాణాలమీదకు తెస్తున్నాయి. నిర్మాణం, నిర్వహణ పేరుతో సిబ్బంది అవలంభిస్తున్న తీరుతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి అభివృద్ధి పనుల పేరుతో ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అయితే గత కొన్నేళ్లుగా మరమ్మతుల పేరుతో నిత్యం ట్రాఫిక్ మళ్లిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తద్వారా పలువురు వాహనదారులు మృత్యువాత పడుతుండగా పదుల సంఖ్యలో వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి నిర్వహణ పనులకు వినియోగిస్తున్న భారీ వాహనాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. గతంలో తణుకు మండలం దువ్వ జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే నిర్వహణ వాటర్ ట్యాంకర్ వాహనం ఢీకొని పదో తరగతి చదువుతున్న బాలిక దుర్మరణం పాలైంది. పాత టోల్‌గేట్ సమీపంలో రోడ్డు నిర్వహణకు వినియోగిస్తున్న లారీను టిప్పర్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృత్యువాత చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతంలో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పలువురు ఇటీవల మృతి చెందారు.

నిత్యం ట్రాఫిక్ మళ్లింపు...

పెనుగొండ మండలం సిద్ధాంతం నుంచి తాడేపల్లిగూడెం వరకు దాదాపు 50 కిలోమీటర్లు మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. జాతీయ రహదారి నిర్వహణ, మరమ్మతులు చేపట్టేందుకు దాదాపు రెండేళ్ల క్రితం ఒక కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. ఇందులో భాగంగా ఈ రోడ్డులో నిత్యం మరమ్మతులు చేస్తుండటంతో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నారు. దీంతో రోడ్డుకు మధ్య భాగంలో ట్రాఫిక్ కోన్స్ ఏర్పాటు చేస్తున్నారు. కిలోమీటర్ల మేర వీటిని ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల దువ్వలో జరిగిన ప్రమాదంలో రోడ్డు డివైడర్‌లో మొక్కలకు నీళ్ల పోసే వాటర్ ట్యాంకర్ వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంతో బాలిక అక్కడిక్కడే దుర్మరణం పాలైంది. గతంలో డీమార్ట్ సమీపంలో సైతం మోటారు సైకిల్‌పై వెళుతున్న మహిళ రోడ్డు డివైడర్‌పై పడి మృతి చెందారు. పెరవలి మండలానికి చెందిన మరో వ్యక్తిని హైవే నిర్వహణ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ సిగ్నల్‌వద్ద వేచి ఉన్న యువకుల మోటారు సైకిల్‌ను వెనుక నుంచి వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. ఇటీవల అలంపురం సెంటర్ వద్ద ట్రాఫిక్ మళ్లింపులో భాగంగా రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొట్టింది. ఈప్రమాదంలో తణుకు పట్టణానికి చెందిన మహిళ మృతి చెందగా ఆమె కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. దువ్వ జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో గొయ్యిలో పడి ఒక యువకుడు మృతి చెందాడు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద డివైడర్ కోసం ఏర్పాటు చేసిన బోర్డును ఢీకొని వ్యక్తి మృతి చెందగా అదే ప్రాంతంలో తీసిన గొయ్యి గమనించకపోవడంతో యువకుడు మృత్యువాత పాలయ్యాడు. తాజాగా ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ట్రాఫిక్ మళ్లిస్తూ రోడ్డుకు అడ్డంగా కట్టిన తాడును గమనించని బైక్‌పై వచ్చిన యువకుడు అదుపు తప్పి ప్రాణాలు కోల్పోయాడు. కేవలం హైవే నిర్వహణ అధికారుల నిర్లక్ష్యంగా కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని బంధువులు ఆందోళనకు సైతం దిగారు.

నాసిరకంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు

నాసిరకం జాతీయ రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఈ మార్గంలో నిత్యం రోడ్డు మరమ్మతులు చేస్తున్నారు. మరోవైపు పగలు సమయాల్లో మాత్రమే మరమ్మతు పనులు చేపడుతూ రోడ్డు మళ్లింపు చేపట్టాల్సి ఉంది. అయితే జాతీయ రహదారి నిర్వహణ సిబ్బంది మాత్రం రాత్రి సమయాల్లో సైతం ట్రాఫిక్ కోన్స్ అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఒక్కోసారి మరమ్మతు పనులు చేయకపోయినప్పటికీ రోడ్డు మార్గం మళ్లిస్తుండటంతో సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జాతీయ రహదారి ఆనుకుని గ్రామాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మరోవైపు ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టిన అధికారులు నిర్లక్ష్యం కారణంగా నిత్యం ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా ప్రస్తుతం వర్షాలు కారణంగా ఈ ప్రాంతంలో రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వహణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ధరల నియంత్రణలో బీజేపీ ప్రభుత్వం విఫలం



తణుకులో ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



తాడేపల్లిగూడెంలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తణుకు: వంద రోజుల్లో ధరలు తగ్గిస్తానని చెప్పి పదేళ్లు అయినప్పటికీ ధరల నియంత్రణలో బీజేపీ విఫలమైందని సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు విమర్శించారు. సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా తణుకు నరేంద్ర కూడలిలో పార్టీ తణుకు సమితి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి నిత్యావసర వస్తువులు ధరలకు అంతే లేదని నాగరాజు విమర్శించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఇతర అన్ని వర్గాల ప్రజలకు తీరని భారంగా మారిందని విమర్శించారు. 2014లో గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉంటే నేడు రూ.1200 పెరిగిందని గుర్తు చేశారు. అధిక ధరల భారంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు మూడుపూటలా తిండి తినలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. మోదీ హయాంలో పేదరికం పెరిగిపోయిందని, అయితే ప్రధాని మోదీ మాత్రం విదేశాలకు వెళ్లి భారత్ వెలిగిపోతుందని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బండి సత్యనారాయణ, పేచర్ల రాంబాబు, నామన వెంకటేశ్వరరావు, బొద్దాని మురళీకృష్ణ, పుట్ట అమ్మిరాజు, ఎ.వెంకటేశ్వరరావు, బొద్దాని కృష్ణకిషోర్, నొడగల అప్పారావు, సబ్బు నాగేశ్వరరావు, కొంగరపుకృష్ణ, గుబ్బల వెంకట్రావు, కర్రి దుర్గారావు, కట్టా కోటేశ్వరరావు, గొర్ల నాగరాజు, పైడి రామారావు, బాలం మీరాబాబు, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన అధిక ధరలను తగ్గించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంచిన అధిక ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ సమితి దేశవ్యాప్త పిలుపులో భాగంగా అధిక ధరలను తగ్గించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, విదేశాలలో ఉన్న నల్లధనాన్ని రప్పిస్తామని, ప్రతిఒక్కరికి ఉపాధి కల్పిస్తామని చెప్పి ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక, హామీలను పక్కనబెట్టి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

తేతలిలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు కోరారు. తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి, తణుకు పట్టణంలోని నెంబరు 5 మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని రుద్రమ దేవి దంపతులు తమ పాఠశాలలో చదివే విద్యార్థుల సౌకర్యార్థం సైకిళ్లను బహూకరించారు. మంగళవారం ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి తండ్రి బాపతు చెన్నారెడ్డి జ్ఞాపకార్థం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే 10 మంది విద్యార్థులకు, తణుకు మున్సిపల్ పాఠశాలలో చదివే ముగ్గురు ప్రతిభావంతులైన విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో తేతలి గ్రామ తెదేపా నాయకులు సరెళ్ల సతీష్, ఎంఈవో డీ మురళీ సత్యనారాయణ, వీ హైమావతి, హెచ్‌ఎం కర్రి పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు గిరీశ్వరరావు, కె నిర్మల్ కుమార్, రామకృష్ణ, బుచ్చియ్య, కె శ్రీనివాసు, జీ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి



విద్యార్థులకు వినాయక మట్టి ప్రతిమలు అందజేస్తున్న సీఐ కాళీచరణ్

భీమవరం: ప్రకృతి ప్రసాదించిన నదీజలాలు, నీటి వనరులు కాలుష్యం బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని దీనిలో భాగంగా వినాయక చవితికి వినాయక మట్టి ప్రతిమలనే పూజించాలని భీమవరం టూటౌన్ సీఐ జి కాళీచరణ్ అన్నారు. వినాయక ఉత్సవాల్లో గణేష్ మట్టి ప్రతిమలను పూజించి జల కాలుష్యాన్ని నిర్మూలిద్దామంటూ విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి విగ్రహాల ఉపయోగాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, మానవతా సంస్థ కో–చైర్మన్ కార్మూరి నర్సిహమూర్తి, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుంపగడపలో రక్తపరీక్షలు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న, ఇతర వ్యాధులకు గురైన వ్యక్తుల నుండి రక్త సేకరణను మంగళవారం చేపట్టారు. తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పాథాలజిస్ట్ డాక్టర్ శృతి ఆధ్వర్యంలో రక్తం సేకరించారు. గ్రామంలో జ్వరం వచ్చిన వారికి, ఇతర వింత వ్యాధులు వచ్చిన వారు సుమారు 26 మంది నుంచి రక్త నమూనాలు సేకరించి తాడేపలిగూడెం తీసుకువెళ్లుతున్నట్లు డాక్టర్ శృతి చెప్పారు.

గుర్రపుడెక్క పరిశీలన

ఆకివీడు: ఉప్పుటేరు ప్రక్షాళనకు భారీ బడ్జెట్ అవసరం అవుతుందని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని ఉప్పుటేరుపై ఉన్న రైల్వే వంతెన ప్రాంతంలో పేరుకుపోయిన గుర్రపుడెక్కను మంగళవారం ఆయన పరిశీలించారు. గుర్రపుడెక్క, కిక్కిస పేరుకుపోవడం వల్ల నీటి ప్రవాహానికి ఇబ్బందికరంగా ఉందని రైతులు, దుంపగడప గ్రామస్తులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు

అత్తిలి: వాతావరణ మార్పులు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు అన్నారు. మంగళవారం అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి నాగరాజు మాట్లాడుతూ తుఫాన్‌ల ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల వైరల్ జ్వరాలు వస్తున్నాయని, ప్రజలు కాచిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. దోమలు ప్రబలకుండా ఫ్రైడే, డ్రైడే తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో ఇమ్యునైజేషన్ జరిగేటప్పుడు ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త ఇమ్యునైజేషన్ డేటాను పాలోఆప్ చేయాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న పిల్లలను వివరాలను తెలుసుకుని వెంటనే ఆరోగ్యసిబ్బందికి సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి మురళి, హెల్త్ ఎడ్యుకేటర్ జి ప్రమీలాదేవి, జి అమ్మాజీ, ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయవాడకు 50 మంది శానిటేషన్ సిబ్బంది తరలింపు



విజయవాడకు తరలివెళ్తున్న మున్సిపల్ సిబ్బంది, చెత్త సేకరించే వాహనాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో శానిటేషన్ పనుల కోసం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాలు తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం నుంచి 50 మంది సిబ్బందిని మంగళవారం తరలించారు. వీరంతా అక్కడ సహాయ చర్యల్లో పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

36 మంది వృద్ధులకు ఉచిత వైద్యసేవలు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 36 మంది వృద్ధులకు వైద్యసేవలు అందజేశారు. తణుకు రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించి రోగులకు మంచి ఆరోగ్యం, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. హాజరైన వృద్ధులకు బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, సీహెచ్ సాధు పాల్గొన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరించాలి

తణుకు టౌన్: టైలర్ల సమస్యలు పరిష్కరించాలని టైలర్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని పార్వతి దేవి ఆలయ ప్రాంగణంలో టైలర్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం మల్లేశ్వరపు నాగరాజు అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పురాతన వృత్తులలో ప్రధానమైన వృత్తి టైలర్స్ వృత్తి ఒకటని, ఈ వృత్తికి ప్రభుత్వ గుర్తింపుకు నోచుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం టైలర్స్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వరరావు, కే వీరభద్రరావు, టీకే వెంకటేశ్వరరావు, కరెళ్ల రాంబాబు, ఆర్ శ్రీనివాసు, నందం శ్రీరాములు, వీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం



తాడేపల్లిగూడెం(టీఓసీ): విజయవాడకు ఆహారం తరలిస్తున్న శశి యాజమాన్యం



తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ నుంచి ఆహార ప్యాకెట్ల వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వి అధిక వర్షాల కారణంగా వరదలకు గురైన విజయవాడ నగరంలో బాధితులకు తాడేపల్లిగూడెంలోని శశి విద్యా సంస్థలు ఆపన్న హస్తం అందించాయి. గూడెంలో ఆహారం తయారు చేయించి విజయవాడకు తీసుకెళ్లి బాధితులకు మబంగళవారం పంపిణీ చేసినట్లు విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, శశి విద్యా సంస్థలు అధ్యాపక బృందం, విద్యార్థిని, విద్యార్థులు ప్యాకెట్లు తయారీలో పాల్గొని విజయవాడకు తరలించినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శశి విద్యా సంస్థల యాజమాన్యంనకు అభినందనలు తెలిపారు.



పెంటపాడు: ట్రిపుల్‌ఎఫ్ ఆధ్వర్యంలో...

వరద బాధితులకు సాయం అందిస్తాం!

తాడేపల్లిగూడెం రూరల్: వరద బాధితులు కోలుకునే వరకు సాయం అందిస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. విజయవాడ, కృష్ణా జిల్లాలో వరద బారిన పడిన బాధితులకు మంగళవారం మండలంలోని పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ నుంచి 25వేల ఆహార ప్యాకెట్ల రవాణాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ వరద బాధితులకు తాడేపల్లిగూడెం అండగా నిలుస్తుందన్నారు. ఆహార ప్యాకెట్లను సమకూరుస్తున్న జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఇన్‌చార్జ్ ఆర్డీవో బీఎస్ఎన్.రెడ్డి, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, జనసేన నాయకులు పైబోయిన వెంకట్రామయ్య, ముఖేష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

విజయవాడకు ఆహార ప్యాకెట్ల సరఫరా

పెంటపాడు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవ ధర్మమని ట్రిపుల్‌ఎఫ్, స్వాభిమాన్ పొండేషన్ అధినేత ఓపీ గోయెంకా అన్నారు. మండలంలోని ప్రత్తి పాడు ట్రిపుల్‌ఎఫ్ కర్మాగార ప్రతినిధులు వరదబాధితులకు సాయం అందించేందుకు తమ ఔదర్యాన్ని చాటుకొన్నారు. విజయవాడ వరదబాధితుల కోసం 5 వేల ఆహార ప్యాకెట్లు తయారు చేయించి, వ్యాన్ ద్వారా తరలించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సీమా గోయెంకా, సునీల్ గోయంకా, జీఎం జి. జనార్ధన్, వేమల శ్రీనివాస్, పొండేషన్ సభ్యులు, ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

వాన్‌బరీ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ

తణుకు: విజయవాడ వరద బాధితులకు వాన్‌బరీ సంస్థ ఆధ్వర్యంలో 3 వేల ఆహార పొట్లాలు, 3 వేల వాటర్ ప్యాకెట్లను మంగళవారం సమకూర్చారు. స్థానిక కె.ఇల్లిందలపర్రులోని వాన్‌బరీ సంస్థ ఆధ్వర్యంలో వ్యాన్‌లో తహసీల్దార్ ఎం.సుందరరాజు సమక్షంలో విజయవాడకు తరలించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ తుషార్‌మెహతా, జనరల్ మేనేజర్ ఎంవీవీ ఎస్ఎన్ మూర్తి, డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.వెంకటేశ్వరరావు, లైజనింగ్ మేనేజర్ చుంచుల వెంకటేశ్వరరావు, సేఫ్టీ మేనేజర్ వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు.